ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY




5 జయశంకర్ భూపాలపల్లి

ఆదివారం 27 జూలై 2025




సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

# కిస్సా కుర్సీకా



## నేడు కేటీఆర్ పర్యటన

**భూపాలపల్లి, మొగుళ్లపల్లిలో కార్యక్రమాలకు హాజరు**

కృష్ణకాలనీ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) భూపాలపల్లి జిల్లాలో ఆదివారం పర్యటించనున్నారు. ఉదయం 11.30 గంటల మొగుళ్లపల్లి మండలం ఇస్సిపేట గ్రామంలో మాజీ సర్పంచ్ కొడారి కొమురయ్య విగ్రహావిష్కరణలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12 గంటలకు అదే మండల కేంద్రంలో జరిగే కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. ఇక్కడ భోజన విరామం తర్వాత మొగుళ్లపల్లి, నవాబుపేట, జడల్‌పేట, ఒడితల, దూద్‌పల్లి, ఎస్ఎంకొత్తపల్లి, మోరంచపల్లి, చెల్పూరు మీదుగా భూపాలపల్లిలోని బీఆర్ఎస్ కార్యాలయానికి చేరుకుంటారు. ఇక్కడ మధ్యాహ్నం 2 గంటల కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ పాల్గొంటారు.

### ఎన్నికల తర్వాత మొదటిసారి

అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి చెందిన తర్వాత పార్టీ ముఖ్య నేతలెవరూ జిల్లాకు రాలేదు. మొదటిసారిగా కేటీఆర్ పర్యటించనున్నారు. కార్యకర్తలతో ఆయన సమావేశమై పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యాచరణపై మాట్లాడతారు. కేడర్‌కు పలు అంశాలపై దిశనిర్దేశం చేయనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు స్థానికసంస్థల ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడానికి కేటీఆర్ భూపాలపల్లి జిల్లా పర్యటనకు శ్రీకారం చుట్టారని కార్యకర్తలు భావిస్తున్నారు. పార్టీలో ప్రక్షాళన చేపట్టి నూతన కమిటీ ఏర్పాటు చేసే ఆలోచన సైతం చేస్తున్నట్లు తెలిసింది. త్వరలోనే భూపాలపల్లి పట్టణంతో పాటు వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, యూత్ అధ్యక్షుల నియామకానికి బీఆర్ఎస్ కసరత్తు చేస్తోందనే చర్చ జరుగుతోంది.

- బీఆర్ఎస్‌లో ఆధిపత్య పోరు!
- గండ్ర, చారి వర్గాలుగా చీలిపోయిన పార్టీ శ్రేణులు
- అధినేత దృష్టికి గ్రూపుల వ్యవహారం
- రంగంలోకి దిగిన కేటీఆర్!
- తగాదాల నేపథ్యంలోనే నేటి పర్యటన ?



బీఆర్ఎస్ కార్యాలయం ఎదురుగా పక్కపక్కనే ఏర్పాటు చేసుకున్న గండ్ర, సిరికొండ ఫ్లెక్సీలు

భూపాలపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌లో వర్గపోరు భగ్గుమంటోంది. పార్టీలో కుర్చీలాట తారస్థాయికి చేరుకుంది. భూపాలపల్లి నుంచి గతంలో ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన గండ్ర వెంకటరమణారెడ్డి, శాసనమండలి ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి నియోజకవర్గంపై ఆధిపత్యం కోసం 'నువ్వా.. నేనా' అన్నట్టు తలపడుతున్నట్టు తెలుస్తోంది. దీని ప్రభావం పార్టీ కేడర్‌పై పడింది. కార్యకర్తలు రెండు వర్గాలుగా చీలిపోయారని తెలుస్తోంది. తాజా మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి వర్గం ప్రస్తుతం జిల్లాలో బలంగా ఉందని, మధుసూదనాచారి వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని వర్గాన్ని తయారు చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారం జిల్లా పార్టీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది. గండ్ర, మధుసూదనాచారి అనుచరులు వర్గాలుగా చీలిపోయరని ప్రచారం ప్రారంభం కావడం వల్ల ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తున్నాయనే తెలుస్తోంది. అటు పార్టీ శ్రేణుల్లోనూ తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఫలితంగా ఈ పరిణామాలు జిల్లాలో బీఆర్ఎస్‌కు తీవ్ర నష్టాన్ని కలిగించే అవకాశం ఉందని నేతలు అధిష్ఠానానికి సమాచారం ఇవ్వడంతో ఈ వ్యవహారంపై పార్టీ అధినేత కేసీఆర్ సీరియస్‌గా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే కొద్ది రోజుల క్రితం వెంకటరమణారెడ్డి, మధుసూదనాచారిని పిలిపించి మాట్లాడినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయినప్పటికీ గడచిన నెల రోజుల్లో జిల్లాలో చోటు చేసుకున్న పరిణామాలు పార్టీ మనుగడను దెబ్బతీసేలా ఉండటం ముఖ్యనేతలను కలవరపరుస్తోంది. ఈ నేపథ్యంలో నేరుగా వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు పరిస్థితిని చక్కదిద్దే బాధ్యతను అధినేత అప్పగించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే ఆదివారం కేటీఆర్ జిల్లా పర్యటనకు వస్తున్నట్లు తెలుస్తోంది.

### స్పష్టత వచ్చేనా..?

భూపాలపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్‌లో ఉత్పన్నమైన ఆధిపత్య (మిగతా 8వ పేజీలో)




### బీఆర్ఎస్‌లో ఫ్లెక్సీల రగడ!

కృషకాలనీ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాక సందర్భంగా ఏర్పాటైన ఫ్లెక్సీలు ఆ పార్టీలో నెలకొన్న వర్గపోరుకు అద్దం పడుతున్నాయనే చర్చ జోరుగా సాగుతోంది. బీఆర్ఎస్ కార్యాలయం ఎదురుగా మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఏర్పాటు చేసిన స్వాగత ఫ్లెక్సీలో ఆయనతోపాటు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతితో పాటు స్థానిక నేతల ఫొటోలు ఉన్నాయి. ప్రొటోకాల్ ప్రకారం శాసన మండలి ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి ఫొటో లేకపోవడం చర్చకు దారి తీసింది. అయితే.. ఈ ఫ్లెక్సీ వెనకనే ఎమ్మెల్సీ మధుసూదనాచారి తనయుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సిరికొండ ప్రశాంత్ ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీలో సిరికొండ మధుసూదనాచారి, కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవిత ఫొటోలను మాత్రమే ముద్రించారు. ఈ ఫ్లెక్సీలో గండ్ర వెంకటరమణారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి ఫొటో గానీ లేకపోవడంపై కూడా బీఆర్ఎస్ శ్రేణులను విస్మయానికి గురిచేసింది.

# ఓరుగల్లు అభివృద్ధికి ప్రాధాన్యం

- రెండో రాజధానిగా అభివృద్ధి చేస్తున్నాం..
- త్వరలోనే మామునూరు ఎయిర్‌పోర్టు పూర్తి చేస్తాం
- టెక్స్‌టైల్ పార్కులో 1,398 మంది నిర్వాసితులకు 863 ప్లాట్లు కేటాయింపు
- రూ.4,170 కోట్ల యూజీడీ పనులు చేపడుతున్నాం
- భద్రకాళి ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- నగరంలో అంతర్జాతీయ స్థాయిలో క్రికెట్ స్టేడియం
- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి
- ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై హైదరాబాద్‌లో సమీక్ష

వరంగల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వరంగల్ సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఉమ్మడి వరంగల్ ఇన్‌చార్జి, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లా సమగ్రాభివృద్ధిపై మంత్రులు కొండా సురేఖ, సీతక్క, ప్రభుత్వ సలహాదారుడు వేంనరేందర్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఆయా జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా చారిత్రాత్మక వరంగల్ నగరాన్ని తెలంగాణకు రెండో రాజధానిగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా నగరాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. వరంగల్ ప్రాంత ప్రజల చిరకాల స్వప్నమైన మామునూరు ఎయిర్‌పోర్టుకు అవసరమైన భూసేకరణ యుద్ధ ప్రతిపాదికన (మిగతా 6వ పేజీలో)



పాల్గొన్న ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు

## సీఎస్ఆర్ నిధులను విద్యాభివృద్ధికి కేటాయించాలి

**సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి నియోజకవర్గంలోని విద్యాభివృద్ధికి సీఎస్ఆర్ నిధులను కేటాయించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని సెక్రటరేట్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో శనివారం జరిగిన వరంగల్ ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. భూపాలపల్లి నియోజకవర్గంలో సింగరేణి, జెన్‌కో సంస్థలు అభివృద్ధి కోసం సీఎస్ఆర్ నిధులు కేటాయిస్తున్నారని, వాటిని పూర్తిగా విద్యాభివృద్ధి కోసం కేటాయించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు తదితర అసంపూర్తి నిర్మాణాలను పూర్తి చేయించాల్సి ఉందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక విద్యతో పాటు ఇతర నైపుణ్యాలను విద్యార్థులకు అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, ధనసరి సీతక్క, ఇతర ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు తదితరులు పాల్గొన్నారు.

# వదలని వాన

- ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో విరామం ఇవ్వని వర్షం
- ములుగు జిల్లాలో సగటు వర్షపాతం 2.89 సెం.మీ
- భూపాలపల్లి జిల్లాలో 2.24 సెం.మీ
- నిండుకుండలా మారిన జలాశయాలు

ములుగు/కృష్ణకాలనీ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): వర్షం విరామం ఇవ్వడం లేదు. ఐదు రోజులుగా ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో వానలు కురుస్తూనే ఉన్నాయి. ములుగు జిల్లాలో శుక్రవారం ఉదయం 8.30 గంట నుంచి శనివారం ఉదయం 8.30 గంటల వరకు 26.08 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా గోవిందరావుపేట మండలంలో 3.62 సెం.మీ నమోదు కాగా అత్యల్పంగా వాజేడు మండలంలో 1.54 సెం.మీ రికార్డు అయ్యింది. వెంకటాపూర్ 3.20 సెం.మీ, ఏటూరునాగారం 2.16 సెం.మీ, తాడ్వాయి 3.18 సెం.మీ, కన్నాయిగూడెం 3.20 సెం.మీ, వెంకటాపూర్ 3.52 సెం.మీ, ములుగు మండలంలో 3.30, మంగపేట 2.36 సెం.మీ వర్షపాతం నమోదైనట్టు అధికారులు వెల్లడించారు. జిల్లాలో సగటున 2.89 సెం.మీ వర్షపాతం నమోదైందని తెలిపారు. కాగా శనివారం ఉదయం 8.30 గంటల నుంచి సాయంత 5 గంటల వరకు ములుగు మండలంలో 1.35 సెం.మీ, వెంకటాపూర్ 2.43 సెం.మీ, వెంకటాపురం 2.18 సెం.మీ, జేడీ మల్లంపల్లి 1.43 సెం.మీ, గోవిందరావుపేట 1.28 సెం.మీ. వాజేడు 4.13, తాడ్వాయి మండలంలో 1.35 సెం.మీ, ఏటూరునాగారం 0.15, మంగపేట మండలంలో 1.23 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు వాతావరణ శాఖ తెలిపింది. వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. గోదావరి స్వల్పంగా పెరుగుతుండటంతో పరీవాహక ప్రాంత ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. దీంతో అధికారులు లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. కన్నాయిగూడెం మండలంలోని తుపాకులగూడెం వద్ద గోదావరి నీటిమట్టం 80.05 మీటర్లు నమోదైంది. మంగపేట మండలంలో కమలాపురం ఇంటేక్‌వెల్ వద్ద 7.0 మీటర్లు, ఏటూరునాగారం మండలంలోని రామన్నగూడెం పుష్కర ఘాట్ వద్ద 13.220 మీటర్లు, వాజేడు మండలంలోని పేరూరు వద్ద 13.08 మీటర్ల నీటిమట్టం ఉన్నట్లు జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. గోవిందరావుపేట మండలంలోని లక్నవరం సరస్సులో 33 అడుగులకు 27 అడుగుల నీరు చేరిందని పేర్కొన్నారు. అలాగే వెంకటాపూర్ మండలంలోని రామప్ప సరస్సులో 36 అడుగులకు 24.8 అడుగుల నీరు ఉన్నట్లు తెలిపారు. వాజేడు మండలంలోని చీకుపల్లి సమీపంలో బొగత జలపాతం ఉధృతి కాస్త నెమ్మదించింది. కన్నాయిగూడెం మండలంలోని తుపాకులగూడెం వద్ద సమ్మక్క సాగర్ బ్యారేజీ 59 గేట్లకు గాను 44 గేట్లు తెరిచి దిగువకు నీటిని వదులుతున్నారు. అలాగే వెంకటాపురం మండలంలోని పాలెం ప్రాజెక్ట్ 4 గేట్లను తెలిరిచి నీరు వదిలిపెడుతున్నారు.



భారీగా వర్షపునీరు చేరి జలకళ సంతరించుకున్న భూపాలపల్లి మండలం పంబాపూర్‌లోని భీంఘన్‌పూర్ చెరువు



వాజేడు మండలంలో పూసూరు-ముళ్లకట్ల వంతెన వద్ద గోదావరి

### భూపాలపల్లి జిల్లాలో..

భూపాలపల్లి వ్యాప్తంగా ఐదు రోజులుగా విరామం ఇవ్వకుండా వర్షం కురుస్తోంది. గత నాలుగు రోజులు తేలికపాటి (మిగతా 8వ పేజీలో)

## వీర జవానులకు ఘన నివాళి

కృష్ణకాలనీ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలో మాజీ సైనికుల సంఘం ఆధ్వర్యంలో కార్గిల్ దివస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఆర్టీసీ డిపో పక్కన ఉన్న అమరవీరుల స్థూపం వద్ద పూలమాలలు నివాళులు అర్పించారు. విద్యుత్ శాఖ ఎస్ఈ మల్హా ర్ నాయక్, భూపాలపల్లి సీఐ నరేష్‌కుమార్ హాజరయ్యారు. జాతీయ జెండాను ఎస్ఈ ఆవి ష్కరించారు. అనంతరం అమరవీరుల కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో మాజీ సైనికులు, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



వీర జవానుల స్థూపం వద్ద నివాళులు అర్పిస్తున్న కుటుంబ సభ్యులు, అధికారులు, మాజీ సైనికులు

## రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కాటారం, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని విలాసాగర్ మానేరు నది నుంచి అక్రమంగా మహాముత్తారం మండలంలోని మాదారానికి ఇసుక తరలిస్తుండగా రెండు ట్రాక్టర్లను శనివారం పట్టుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. చింతకాని క్రాస్ సమీపంలో వాహనాలు తనిఖీలు చేస్తుండగా ట్రాక్టర్లు పట్టుబడ్డాయని అన్నారు. ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌లో పెట్టి ట్రాక్టర్ల ఓనర్లు, డ్రైవర్లు విజయ, దిలీప్, రాజబాపు, శ్రీధర్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## ఆగని అశ్రుధార

- ప్రకృతి ప్రకోపానికి వణికిన పల్లెలు
- 'కొండాయి' విషాదానికి రెండేళ్లు
- జలప్రయళం సృష్టించిన జంపన్నవాగు
- గల్లంతై ప్రాణాలు కోల్పోయిన 8 మంది



కొండాయి ముంచిన జంపన్నవాగు (ఫైల్)



వరదలో కొట్టుకుపోయి విగతజీవులుగా మారిన గ్రామస్థులు (ఫైల్)

వివరాలు 6వ పేజీలో..

## కాళేశ్వరంలో శ్రావణ సందడి


మహదేవపూర్, జూలై 26(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాళేశ్వరంలో శ్రావణ శనివారం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజలు చేశారు. ముందుగా త్రివేణి సంగమ గోదావరిలో స్నానాలు ఆచరించి గోదావరి మాతకు ప్రత్యేక పూజలు చేశారు. పసుపు, కుంకుమలు వదిలారు. అనంతరం కాళేశ్వరాలయంలో ముక్తీశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. శుభానందదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుల నుంచి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

# గంగారం కొండలపై నుంచి..

● జాలువారుతున్న ఏడుబావుల జలపాతం



దట్టమైన అడవుల నడుమన అలరిస్తున్న జలపాతం

గంగారం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లాలో పకృతి అందాలకు నిలయమైన గంగారం మండలంలో దట్టమైన అడవులనడుమనున్న ఏడు బావుల జలపాతం మంత్రముగ్ధులను చేస్తుంది. ఇటీవల ఎడతెలరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు గంగారం మండల కేంద్రానికి పదికిలో మీటర్ల దూరంలో దట్టమైన అడవులనడుమన ఎత్తయిన కొండపై నుంచి ఏడు బావుల జలపాతం సవ్వడి చేస్తుంది. ఎంతో ప్రమాదకరమైన ఈ జలపాతం అందాలను ఆస్వాదించటానికి పట్టణ ప్రాంతాల నుంచి పర్యాటకులు రావటంతో సందడి నెలకొంది. ఈ జలపాతం కొండపై నుంచి మొదటి బావిలో పడి లేచి రెండవ బావిలో పడతాయి. అలా ఏడు బావుల నుంచి ఈ జలపాతం క్రిందకు వస్తుంది. ఏడవ బావిలో పడిన నీరు భూగర్భంలోని సొరంగ మార్గంద్వారా వెళ్లిపోవటం విశేషం. భారీగా కురిసే వర్షలకు ఈ జలపాతం అందాలకు ప్రకృతి ఆరాధించేవారు మంత్రముగ్ధులు కావాల్సిందే.

## కేయూలో నలుగురికి పదోన్నతులు

కేయూ క్యాంపస్ జూలై 26, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో అసిస్టెంట్ రిజిస్ట్రార్లుగా పనిచేస్తున్న నలుగురికి డిప్యూటీ రిజిస్ట్రార్‌లుగా పదోన్నతి ఉత్తర్వులను కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం వెలువరించారు. పదోన్నతి పొందిన వారిలో టీచింగ్ విభాగంలో పనిచేస్తున్న పంజాల శ్రీధర్, యూజీసీలో పనిచేస్తున్న హబీబుద్దీన్, ఆడిట్‌లో పనిచేస్తున్న ఎల్.రాము, పరీక్షలు విభాగంలో పనిచేస్తున్న డాక్టర్ ఎం.నరసింహరావులకు పదోన్నతి లభించింది. ఈ మేరకు పదోన్నతి పొందిన డీఆర్‌లకు కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలు పరిపాలన భవనంలో ఉత్తర్వులను అందచేసి అభినందించారు

# ఆగని అశ్రుధార

● ప్రకృతి ప్రకోపానికి వణికిన పల్లెలు ● 'కొండాయి' విషాదానికి రెండేళ్లు
● జలప్రయళం సృష్టించిన జంపన్నవాగు ● గల్లంతై ప్రాణాలు కోల్పోయిన 8 మంది



కొండాయిని ముంచిన జంపన్నవాగు (ఫైల్)

ఏటూరునాగారం రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : అవి ఆకుపచ్చని పల్లెలు. కల్మషం ఎరుగని జనజీవనం. ప్రకృతి మాత్రం ఆ గ్రామాలపై కన్నెర్రజేసింది. తలాపున ఉన్న జంపన్నవాగు వారిని నిండా ముంచెత్తింది. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మహా ఉగ్రరూపం దాల్చి ఎనిమిది మందిని మింగేసింది. ఆ జలప్రళయాన్ని ఎదుర్కొన్న గ్రామస్థుల కళ్ల ముందు నేటికీ ఆ దృశ్యాలు కదలాతూనే ఉన్నాయి. ఇది జరిగి ఆదివారానికి రెండేళ్లు పూర్తవుతుండగా తమ కూడు, గూడు ఛిద్రమైన ఆ చీకటి రోజును తలుచుకొని కంటతడి పెడుతూనే ఉన్నారు.

### ప్రశాంత పల్లెల్లో ప్రళయం

ప్రశాంతకు మారుపేరుగా నిలిచే అటవీ పల్లెల్లో జంపన్నవాగు సృష్టించిన జల ప్రళయం గ్రామాలను కకావికలు చేసింది. 2023 జూలై 27న జంపన్నవాగు మహోగ్రరూపం దాల్చింది. ఊర్లను చుట్టుముట్టి ఎనిమిది మందిని బలికొంది. ఆ రోజుకు ముందు రాత్రి జంపన్నవాగు ఎగువ ప్రాంతాలతో పాటు పరిసర ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో జడివాన కురిసింది. ఎగువ ప్రాంతాల్లోంచి వస్తున్న వరద జంపన్నవాగుకు పోటెత్తింది. ఎప్పటిలాగే జంపన్నవాగు ఉప్పొంగిదని అనుకున్నారు గ్రామస్థులు. ఎవరి పనుల్లో వారు మునిగిపోయారు. కానీ ఉదయం 8 గంటలకే జంపన్నవాగు ఉగ్రరూపం దాల్చి మేడారంలో వరద బీభత్సం సృష్టించింది. గతంలో ఎన్నడూ లేని విధంగా మేడారంలోని అమ్మవార్ల గద్దెలను తాకుతూ జంపన్నవాగు ప్రవహించింది. కానీ బయట ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి ఆ గ్రామాలది. రెండు రోజులుగా కురిసిన వర్షాలకు విద్యుత్తు సరాఫరా లేకపోవడం, సెల్‌ఫోన్ల సిగ్నల్ లేకపోవడం వారికి శాపంగా మారింది. ఉదయం 9 గంటల దాకా మామూలుగా ఉన్న జంపన్నవాగు గంటకు గంటకూ తన ప్రతాపాన్ని చూపి ఆ పల్లెవాసు లు తెరుకునే లోపే వరద చుట్టుముట్టింది.

### పరుగులు పెట్టినా దక్కని ప్రాణాలు

అసలేం జరుగుతుందో తెలియని అయోమయం ఉన్న జనం తేరుకొనే లోపే జంపన్నవాగు వరద ఆ గ్రామాలను చుట్టుముట్టింది. ఇళ్లల్లో ఉన్న సామాన్ల కూడా సర్దుకొనే అవకాశమే లేకుండా జంపన్నవాగు జల ప్రళయాన్ని ఆ గ్రామాలపై చూపింది. భారీగా వచ్చి చేరుతున్న వరద నీటిని చూసి ఆ గ్రామాల ప్రజలు భయాందోళనలు చెందారు. గంటల వ్యవధిలోనే ఇళ్లల్లోకి భారీగా వరద నీరు చేరడంతో పాటు రోడ్లన్నీ జలమయం కావడంతో పరిస్థితి చేయి దాటింది. దీంతో ప్రాణాలను కాపాడుకోవడం కోసం కొండాయి వాసులు సురక్షిత ప్రాంతానికి ఉన్నపళంగా బయల్దేరారు. అప్పటికే వరద రోడ్లు కనబడకుండా ప్రమాదకర స్థాయికి చేరుకుంది. ఆర్తనాదాలు చేస్తూ కొందరు పరుగులు పెట్టగా, మరికొందరు కొండాయిలో ఓ భవనంపైకి ఎక్కి తలదాచుకున్నారు.

సురక్షిత ప్రాంతాలకు చేరుతున్న క్రమంలో ఆ గ్రామంలో కల్వర్టు వద్ద తీసిన లోతులోకి పడ్డారు. కొండాయి గ్రామానికి చెందిన దబ్బకట్ల సమ్మక్క, ఎమ్డీ అజ్జు, ఎమ్డీ షరీఫ్, ఎమ్డీ మహబూబ్‌ఖాన్, ఎమ్డీ మజీద్ ఖాన్, ఆయన భార్య లాల్‌బీ, రషీద్, ఆయన భార్య కరిమాబీ వరదలో కొట్టుకపోయి గల్లంతయ్యారు. మిగతా కొంతమంది భవనంపైకి ఎక్కి తమను తాము కాపాడుకున్నారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ రాత్రంతా అక్కడే ఉన్నారు. భవనంపై అంతస్థును తాకుతూ వెళ్తున్న వరద చూసి ప్రాణాలు బిగపట్టుకొని దేవుడు మీద భారం వేసి అక్కడే ఉండిపోయారు. రాత్రి 12 గంటల దాకా పెరిగిన వరద ఆ తర్వాత క్రమంగా తగ్గుముఖం పట్టింది. మరో రెండు గంటలు వరద తాకిడి ఉంటే ఓ భవనంపై ఉన్నవారంతా జలసమాధి అయ్యేవారు. ఆ వరద మొదటగా అంచనా వేయడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైంది. సమయం దాటాక అధికార యంత్రాంగం ఆ గ్రామాల్లో సహాయక చర్యలు చేపట్టడానికి విశ్వ ప్రయత్నాలు చేసినా ఫలితం లేకుండా పోయింది.

### సర్వం కోల్పోయి.. నిరాశ్రయులై..

జంపన్నవాగు ఉధృతికి ఆ గ్రామాల్లోని ఇళ్లు, పశువులు, వస్తువులు, సామగ్రి.. ఇలా సర్వం జలమయం కాగా కొండాయి, మల్యాల గ్రామాల ప్రజలు నిరాశ్రయులై భారీగా నష్టపోయారు. మట్టి ఇళ్లన్నీ వరద తాకిడి కూలిపోయాయి. విలువైన సామాన్లన్నీ వరదలో కొట్టుకుపోయాయి.

### నేటికీ నెరవేరని హామీ

సర్వం కోల్పోయిన గ్రామాలకు అప్పటి ప్రభుత్వం పలు హామీనిచ్చింది. వరదల్లో చనిపోయిన కుటుంబాలకు రూ. 5లక్షల ఎక్స్‌గ్రేషియాను కేసీఆర్ సర్కారు అందించింది. అంతేకాకుండా నష్టపోయిన ప్రతి కుటుంబానికీ రూ. 10వేల పరిహారం పంపిణీ చేసింది. అయితే.. ఆ గ్రామాన్ని వేరే ప్రాంతానికి తరలించి పక్కా ఇళ్లను నిర్మించి ఇస్తానని హామీని ఇచ్చింది. కొద్ది నెలల్లోనే బీఆర్ఎస్ అధికారం కోల్పోయింది. అనంతరం కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ గ్రామాన్ని తరలించే ప్రణాళికను అమలు చేయలేదు. జంపన్నవాగు ఉధృతికి వాగుపై నిర్మించిన బ్రిడ్జి సైతం కొట్టుకుపోగా రెండేళ్లు అవుతున్నా దాని నిర్మాణం చేపట్టలేదు.

# ఉప్పరపల్లి హత్య కేసులో దంపతుల అరెస్ట్

● బావను హత్య చేసిన బావమరిది, అతని భార్య
● వివరాలు వెల్లడించిన డీఎస్పీ తిరుపతిరావు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ తిరుపతిరావు

కేసముద్రం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) :కేసముద్రం మండలం ఉప్పరపల్లిలో ఈ నెల 23న కంకల ఉప్పలయ్య హత్య కేసులో మృతుని బావమరిది, అతని భార్యను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తిరుపతిరావు తెలిపారు. మహబూబాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం నిందితుల అరెస్ట్‌చూపుతూ వివరాలను డీఎస్పీ వెల్లడించారు. గ్రామానికి చెందిన కొనగొండ్ల చెన్నయ్య తనకున్న భూమిలోంచి ముగ్గురు కుమార్తెలకు మూడున్నర ఎకరాలను రాసిచ్చారు. ఈ విషయంలో పెద్ద కుమార్తె భర్త కంకల ఉప్పలయ్య(50) కు చెన్నయ్య కొడుకైన కొనగొండ్ల మల్లేషం(బావమరిది)తో కొద్దిరోజులుగా భూమికి సంబంధించిన వివాదం కొనసాగుతోంది. ఈ క్రమంలో ఈనెల 23న మధ్యాహ్నం కొనగొండ మల్లేషం ఆయన భార్య ఉమ ఇద్దరు కలిసి స్టీల్ రాడ్, కత్తి, ఇనుప చువ్వతో గొర్రెలను కాసేందుకు వెళ్లిన ఉప్పలయ్య తలపై పలు మార్లు దాడి చేశారు. ఉప్పలయ్య చనిపోయాడని నిర్ధారించుకున్న తర్వాత ఊరి చివరన గడ్డివామిలో హత్యకు ఉపయోగించిన ఆయుధాలను దాచి పెట్టి అక్కడి నుంచి బైక్‌పై వరంగల్ వైపునకు పారిపోయారు. బైక్‌పై తిరిగి శనివారం తమ ఇంటికి వస్తుండగా ఉప్పరపల్లి క్రాస్‌రోడ్డు వద్ద వారిని పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద హత్యకు ఉపయోగించిన ఆయుధాలతోపాటు బైక్, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. త్వరితగతిన హత్యకేసును చేధించి, నిందితుల అరెస్ట్‌కు కృషి చేసిన రూరల్ సీఐ సర్వయ్య, ఎస్ఐలు నరేష్, కరుణాకర్, రవికిరణ్, దీపిక, సిబ్బందిని జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.

# అందుబాటులో సరిపడా యూరియా

ఇన్‌చార్జి డీఏవో బాపురావు

కృష్ణకాలనీ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రైతులెవరూ ఆందోళన చెందొద్దని, సాగుకు సరిపడా యూరియా జిల్లాలో అందుబాటులో ఉందని వ్యవసాయ శాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి జాడి బాపురావు తెలిపారు. భూపాలపల్లిలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను మండల వ్యవసాయశాఖ అధికారి సతీష్‌తో కలిసి శనివారం తనిఖీ చేశారు. స్టాక్, విక్రయాల రికార్డులను పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అమ్మకాలు చేపట్టాలన్నారు. యూరియా కొరత ఉందనేది అవాస్తవమన్నారు. జంగేడు పీఏసీఎస్‌లో 1,489 బస్తాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

యూరియా తీసుకునే రైతుల వివరాలు వారి ఆధార్‌ను ఏపోస్ మిష న్‌లో నమోదు చేయాలన్నారు. నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా, డీఏపీకి బదులు నానో డీఏపీ వాడితే అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు.





# సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు

డిప్యూటీ స్పీకర్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

రూ.245కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం



కార్గిల్ అమర జవాన్లకు నివాళులర్పించి మాట్లాడుతున్న రాంచంద్రునాయక్

మరిపెడ, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమం, అభివృద్ధి పథకాలు రెండు కళ్లు అని డిప్యూటీ స్పీకర్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. శనివారం మరిపెడ బస్టాండ్ ప్రాంగణంలోని పిచ్చి మొక్కలు, చెత్తచేదారం శ్రమదానం చేసి స్థానిక కాంగ్రెస్ కార్యకర్తలు, నేతలతో కలిసి తొలిగించారు. అనంతరం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇందిరమ్మ పల్లె, పట్టణ ప్రగతి యాత్ర ప్రోగ్రామ్‌ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మరిపెడ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నేత వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి, యువ నాయకుడు అభినవ్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ విజయానంద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రఘువీర్ రెడ్డి, అప్జల్, పట్టణ అధ్యక్షుడు తాజ్‌దీన్, మాజీ సర్పంచ్ రాంలాల్, మాజీ ఎంపీటీసీ అంబరీశ తదితరులు పాల్గొన్నారు. అలాగే మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని రూ.2.45కోట్లతో చేపట్టిన మాకుల పెద్ద చెరువు బ్యూటీషన్ పనులు, మహబూబాబాద్ రూట్‌లో రోడ్డు విస్తరణ పనులకు డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్ శంకుస్థాపన చేశారు. మరిపెడ మాకుల చెరువు ఆధునీకరణతో భక్తులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని గుర్తు చేశారు.

### సైనికులకు సలామ్..

అమర జవాన్ల త్యాగ ఫలితమే కార్గిల్ యుద్ధ విజయమని అందుకు భారత సైనికులకు సలామ్ కొడుతున్నానని డిప్యూటీ స్పీకర్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రునాయక్ అన్నారు. శనివారం కార్గిల్ ట్రస్ట్ కన్వీనర్ గాదె రాంబాబు అధ్యక్షతన జరిగిన కార్గిల్ దివస్‌కు రాంచంద్రునాయక్ హాజరై కార్గిల్ స్థూపానికి పూల మాలలేసి అమర జవాన్లకు నివాళులర్పించారు. విద్యార్థులు దేశ రక్షణలో భాగస్వామ్యం కావాలని ఆకాంక్షించారు. కార్గిల్ ట్రస్ట్ చైర్మన్ రాంబాబును అభినందించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీ నేతలు, పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

## యూరియా బ్లాక్ చేస్తే లైసెన్స్ రద్దు



మరిపెడలోని ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్ షాపుల్లో తనిఖీలు నిర్వహిస్తున్న ఏడీఏ విజయ్‌చందర్

మరిపెడ, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : యూరియా బ్లాక్ చేసే వ్యాపారుల లైసెన్స్‌లు రద్దు చేస్తామని మరిపెడ వ్యవసాయ డివిజన్ సంయుక్త సంచాలకులు విజయ్‌చందర్ ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ డీలర్లను హెచ్చరించారు. శనివారం ఆయన స్థానిక ఎంఏవో వీరాసింగ్‌తో కలిసి మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని లక్ష్మీశ్రీనివాస, సిద్ధార్థ ఏజెన్సీ, అయ్యప్ప, సాయిరాం, వెంకటేశ్వర, వర్షిత అగ్రిమాల్ షాపులను ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. యూరియా నిల్వలపై చెక్‌చేశారు. రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేస్తే బిల్లులు అడిగి తీసుకోవాలన్నారు. నిషేధిత విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. తనిఖీలో స్థానిక ఏఈవోలు పాల్గొన్నారు.

## మరికొన్ని రోజులు బొగత బంద్

వాజేడు, జూలై 26(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వాజేడు మండలంలోని బొగత జలపాత సందర్శనను మరికొన్ని రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు ఎఫ్ఆర్‌వో చంద్రమౌళి తెలిపారు. భారీ వర్షాల కారణంగా ఈనెల 23న బొగతకు జలప్రవాహం పెరిగింది. దీంతో ప్రమాదకరంగా మారటంతో పర్యాటకుల రక్షణ చర్యల్లో భాగంగా సందర్శనను అటవీ శాఖ అధికారులు ఈనెల 26 వరకు నిలిపివేశారు. వర్షాలు తగ్గుముఖం పట్టేలా లేకపోవడంతో మరికొన్ని రోజులు సందర్శనను నిలిపివేస్తున్నట్లు ఎఫ్ఆర్‌వో ప్రకటించారు. త్వరలోనే సందర్శన అనుమతి తేదీలను ప్రకటిస్తామన్నారు.

## గంజాయి పట్టివేత

మహాముత్తారం, జూలై26 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం దొబ్బలపాడులో గంజాయిని శనివారం పట్టుకున్నట్టు ఎస్సై మహేంద్ర కుమార్ తెలిపారు. మోడల్ స్కూల్ సమీపంలో ద్విచక్ర వాహనంపై గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొన్నట్లు పేర్కొన్నారు. మండలంలోని స్తంభంపల్లి (పీపీ) గ్రామానికి చెందిన లోక హరిప్రసాద్, జనగాం అంజికుమార్ అనే యువకులు ఒడిశాకు వెళ్లి ఆరున్నర కిలోల గంజాయి కొనుగోలు చేసి మహాముత్తారం మండలం మీదుగా కరీంనగర్‌కు తరలిస్తుండగా పక్కా సమాచారంతో పట్టుకున్నామని తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ. లక్ష 30 వేలు ఉంటుందని తెలిపారు.



గంజాయితో పట్టుబడిన నిందితులతో పోలీసులు

## ఏటూరునాగారం అగ్నిమాపక భవనానికి నిధులు

ఏటూరునాగారం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలో అగ్నిమాపక భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా శనివారం ప్రకటించారు. ఏటూరునాగారంలో అగ్నిమాపక భవన నిర్మాణానికి రూ. 2 కోట్లు కేటాయించారు. మేడారంలో ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ నిర్మాణానికి రూ. 5 కోట్లు మంజూరు చేశారు.

# రోగాలకు నిలయంగా ఓపెన్ ప్లాట్లు

● మునిసిపాలిటీలో ఓపెన్ ప్లాట్లలో పేరుకుపోతున్న చెత్తాచెదారం
● పొంచి ఉన్న సీజనల్ వ్యాధుల ముప్పు ● పట్టించుకోని అధికారులు



ఖాళీ స్థలంలో నిలిచిపోయిన మురుగునీరు

తొర్రూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ కేంద్రాల్లో ఉన్న ఓపెన్ ప్లాట్‌లలో చెత్తచెదారం, మురుగునీరు పేరుకుపోయి స్థానిక ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. వాటిలో పెరుగుతున్న చెట్లను సదరు యజమానులు నరికివేయకుండా నిర్లక్ష్యం చేయడంతో చెత్తతో పాటు రకరకాల ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలు పడేయడం వల్ల వర్షాలకు మురుగునీరు చేరి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఇటీవల గత వారం రోజులుగా కురిసిన వర్షాలకు ఖాళీ స్థలాల్లో నీరు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు కంపచెట్లు కూడా పెరగడంతో పాములు, ఇతర విష కీటకాల బెడద తీవ్రంగా ఉంది. పట్టణంలోని 16 వార్డుల పరిధిలో సుమారు 28 వేల వరకు జనాభా ఉంది. ప్రతి వార్డులో వందల సంఖ్యలో ఖాళీ ప్లాట్‌లు ఉన్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతుండటంతో పట్టణంలోని శివారు కాలనీలు, బస్తీలు విస్తరిస్తున్నాయి. వీటికి తోడు అనధికారిక వెంచర్లు విరివిగా చేయడంతో చెత్త చెదారం ఖాళీ ప్లాట్‌లలో పెరిగిపోతుంది. చుట్టుపక్కల గ్రామాల్లోని ప్రజలు భవిష్యత్ అవసరాల కోసం ఉద్యోగులు, వ్యాపారులు, రాజకీయ నాయకులు ప్లాట్‌లను కొనుగోలు చేసి ఎలాంటి నిర్మాణాలు చేపట్టకపోవడంతో ఖాళీగా ఉంటున్నాయి.

ఏండ్ల తరబడి పట్టించుకోకపోవడంతో చెట్లు పెరిగి మురుగునీరు నిలిచి అపరిశుభ్రతకు కేరాఫ్‌గా మారుతుండటంతో పరిసరాలు దుర్గంధంగా మారుతున్నాయి. వేలాదిగా ఉన్న ప్లాట్‌లను శుభ్రపరిచి సంబంధిత యజమానులకు జరిమానాతో పాటు నోటీసులు అందించాలని లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ఖాళీ ప్లాట్‌లలో చెత్తచెదారం తొలగించేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

### ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు

పట్టణంలోని వివిధ వార్డుల్లోని ఖాళీ ప్లాట్‌లలో పిచ్చి మొక్కలు పెరిగి పాములు, ఇతర క్రిమి కీటకాలతో ఇబ్బందులు పడుతున్నా మునిసిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. మునిసిపల్ కమిషనర్‌కు, ప్రజా ప్రతినిధులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యం వహిస్తున్నారు. స్వచ్ఛ సర్వేక్షన్ పేరుతో మునిసిపల్ సిబ్బంది తెలిసిన వారి దగ్గర ఫోన్ నంబర్‌లతో ఆన్‌లైన్ చేయడం తప్ప ప్రజల బాగోగులు చూడటం లేదు. మునిసిపల్ అధికారులు శానిటరీ సిబ్బందికి తెలిపినా వారు నిర్లక్ష్యం వహిస్తున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

- రామగిరి భాస్కరాచారి, స్థానికుడు, తొర్రూరు



ఉల్లెపల్లిలో చెక్‌డ్యామ్ మరమ్మతు పనులకు శంకుస్థాపన చేస్తున్న డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

▸ డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్

మరిపెడ రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని డోర్నకల్ ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. శనివారం మరిపెడ మండలంలోని ఉల్లెపల్లిలో ఆకేరు వాగు చెక్ డ్యామ్ మరమ్మతులకు రూ.44.45 లక్షలతో, పురుషోత్తమాయగూడెం చెక్‌డ్యామ్ కల్వర్టు మరమ్మతులకు రూ.49.30, రూప్‌సింగ్ ఎస్డీఎఫ్ నిధులతో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాంచంద్రునాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 19 నెలలు కావస్తోందని, సీఎం రేవంత్‌రెడ్డి అనేక సంక్షేమ, అభివృద్ధి పనులు చేశాడన్నారు. గత పదేళ్లు పరిపాలన చేసిన బీఆర్ఎస్ పార్టీ రేషన్‌కార్డులే ఇవ్వలేదని దుయ్యబట్టారు. రాష్ట్రం మొత్తం ఇందిరమ్మ గృహాలతో నిరుపేదలు సంతోషాన్ని వ్యక్తపరుస్తున్నారన్నారు. అంతేకాక సన్న బియంతో కడుపు నిండా తింటున్నారన్నారు. ఆయా కార్యక్రమాల్లో నూకల అభినవ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి, షేక్ అఫ్జల్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోతు రవినాయక్, యూత్ మండల అధ్యక్షుడు నరేశ్‌నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు పెండ్లి రఘువీరారెడ్డి, విసారపు శ్రీపాల్‌రెడ్డి, మెంచు అశోక్‌గౌడ్, అలువాల ఉపేందర్ ప్రజాపతి, మాలోతు బీకునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## హోరాహోరీగా కొనసాగుతున్న బ్యాడ్మింటన్ టోర్నీ

- సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో ఫైనల్స్‌కు చేరుకున్న షట్లర్లు
- నేటితో ముగియనున్న రాష్ట్రస్థాయి టోర్నీ



సెమీ ఫైనల్స్ డబుల్స్ విభాగంలో తలపడుతున్న క్రీడాకారులు

వరంగల్ స్పోర్ట్స్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : యోనెక్స్ సన్‌రైజ్ సహకారంతో మహబూబాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ సుబేదారిలోని ఆఫీసర్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన 11వ తెలంగాణ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ అండర్-17 బాలబాలికల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు క్రీడాకారుల మధ్య హోరాహోరీగా కొనసాగుతున్నాయి. క్రీడా పోటీల్లో భాగంగా రెండో రోజు శనివారం ఆఫీసర్స్ క్లబ్, ఎర్రగట్టు గుట్ట సమీపంలోని కిట్స్ కళాశాల వేదికగా ఏర్పాటు చేసిన పోటీల్లో పలు జిల్లాలకు చెందిన షట్లర్లు క్వార్టర్, సెమీ ఫైనల్స్‌లో సింగిల్స్ డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో పాల్గొన్నారని మహబూబాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మూల జితేందర్‌రెడ్డి, డాక్టర్ కొమ్ము రాజేందర్‌లు తెలిపారు. క్వార్టర్, సెమీ ఫైనల్స్‌తో గెలుపే లక్ష్యంగా క్రీడాకారులు పోటీపడుతూ విజయం వైపు దూసుకుపోతూ ఫైనల్స్‌కు అర్హత సాధించారన్నారు. మూడు రోజుల క్రీడా పోటీల నిర్వహణలో భాగంగా ఆదివారం ఆఫీసర్స్ క్లబ్‌లో క్రీడా పోటీల ముగింపు సమావేశం నిర్వహిస్తామన్నారు. ఈ ముగింపు వేడుకలకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో పాటు ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్, అంతర్జాతీయస్థాయి పూర్వపు బ్యాడ్మింటన్ క్రీడాకారులు సీఎం శశిధర్ ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులును ప్రదానం చేయనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పింగిలి రమేష్‌రెడ్డి, కోశాధికారి నాగ కిషన్, టోర్నమెంట్ అబ్జర్వర్లు యూవీఎన్. బాబు, రెఫరీ కె.హనుమంతరావు, మ్యాచ్ కంట్రోల్ చంద్రశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### ఫైనల్స్‌కు చేరిన జట్లు

- **అండర్-17 బాలుర సింగిల్స్ విభాగంలో :** శశాంక్ వనమాల (నల్లండ), గిరివాసన్ శరవన్‌కుమార్ (రంగారెడ్డి)పై 10-15, 16-14, 15-8 తేడాతో గెలుపొంది ఫైనల్స్‌కు అర్హత సాధించాడు. యువసూర్య (హైదరాబాద్), తన్మయ్‌నిహల్ ఉత్తం (కరీంనగర్)పై 15-12, 10-15, 15-09 తేడాతో విజయం సాధించాడు.
- **బాలికల సింగిల్స్‌లో.. :** ప్రాంజల నిసర్గ (రంగారెడ్డి), అవిని విక్రమ్ గోవింద్ (రంగారెడ్డి)పై 15-9, 15-11 తేడాతో గెలుపొంది ఫైనల్స్‌కు చేరుకున్నారు. ఆదే విధంగా సరయు సూర్యనేని (హైదరాబాద్), హంసిని చదరం (రంగారెడ్డి)పై 15-12, 10-15, 21-19 తో విజయం సాధించింది.
- **బాలికల డబుల్స్‌లో.. :** ఆరాధ్యరెడ్డి హన్మంతయ్యగారి, అవినిరెడ్డి హన్మంతయ్యగారి (రంగారెడ్డి), హన్సిక ఆవుల, హన్సిక మధురాజన్ (రంగారెడ్డి)పై 15-3, 15-8తో గెలుపొంది ఫైనల్స్‌కు చేరుకున్నారు. శ్రీదేవికాదిశ్య, శృతి (సంగారెడ్డి), జస్మిత్ పెన్నేరు, శ్రీదిత్య (సంగారెడ్డి)పై 15-9, 15-13తో విజయం సాధించి బాలికల డబుల్స్ ఫైనల్స్‌లో తలపడనున్నారు.

## శరవేగంగా ఏటీసీల ఏర్పాటు



ములుగు రోడ్డులోని ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న ఏటీసీ షెడ్డు

- చురుకుగా షెడ్ల నిర్మాణ పనులు
- తొలి విడత తొమ్మిది ఐటీఐలలో ఏటీసీల ఏర్పాటు
- ఆరు చోట్ల 90 శాతం పనులు పూర్తి
- మూడు చోట్ల మొదలుకాని పనులు
- ఒక్కొక్క దాని వ్యయం రూ.40 కోట్లు
- ఐటీఐలకు చేరుకున్న ఏటీసీ పరికరాలు

హనుమకొండ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఏడు పారిశ్రామిక శిక్షణా సంస్థల(ఐటీఐ)లో అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్ల(ఏటీసీ) షెడ్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడతగా 65 ఐటీఐలలో ఏటీసీ షెడ్ల నిర్మాణ పనులను ప్రభుత్వం చేపట్టింది. రెండో విడత కింద మరో 44 ఐటీఐలలో ఏటీసీలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 10 ఏటీసీలు మంజూరయ్యాయి. వీటిల్లో వరంగల్, హనుమకొండ, కాజీపేట భూపాలపల్లి, ఏటూరునాగారం, వాజే డు, మహబూబాబాద్ ఐటీలలో ఏటీసీ షెడ్ల పనులు దాదాపు 90 శాతం పూర్తయ్యాయి. వరంగల్, హనుమకొండ, కాజీపేట ఏటీసీ షెడ్లు ములుగు రోడ్డులోని ఐటీఐ ప్రాంగణంలోనే నిర్మిస్తున్నారు. ఆగస్టు నెలాఖరు నాటికి పనులు పూర్త యి వీటిలో సెప్టెంబరులో తరగతులు ప్రారంభం కావచ్చు నని తెలుస్తోంది. కాగా, జనగామ, పరకాల, వర్ధన్నపేట ఏటీసీలకు స్థలం అందుబాటులో లేకపోవడంతో ఇక్కడ ఏటీసీల పనులు ఇంకా మొదలు కాలేదు. షెడ్ల నిర్మాణం పూర్తయితే ఆ వెంటనే వాటిలో పరికరాలను అమర్చుతారు. పరికరాలు కూడా అప్పుడే వచ్చేశాయి.

### ఐటీఐల ఆధునీకరణ

ఐటీలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించుకుంది. ఈ మేరకు టాటా టెక్నాలజీ లిమిటెడ్‌తో(టీటీఎల్) ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. టీటీఎల్ ఒక్కొక్క ఏటీసీని రూ.40 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేస్తోంది. ఇందుకోసం టీటీఎల్ మొత్తం రూ.2,324 కోట్లను వెచ్చిస్తోంది. ఐటీఐ సర్కిల్ డెవలప్‌మెంట్ అప్‌గ్రేడేషన్ ప్రాజెక్టులో భాగంగా ఆధునిక పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు వీటిలో శిక్షణ ఇస్తారు. ఇందుకోసం అధునాతన సామగ్రిని, సాంకేతికతను ఏర్పాటు చేస్తారు. ప్రత్యేక నిపుణులతో ఇందులో విద్యార్థులకు శిక్షణ ఇస్తారు.

### ఏటీసీల్లో ఆరు కొత్త కోర్సులు



ములుగు రోడ్డులోని ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న ఏటీసీ షెడ్డు

ఐటీఐ విద్యార్థులు పోటీ ప్రపంచంలో ఎదురయ్యే సవాళ్లను తట్టుకొని ఉపాధి అవకాశాలు పొందగలిగేలా వారిలో వృత్తిపరమైన నైపుణ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో ప్రభుత్వం ఐటీఐ సర్కిల్ డెవలప్‌మెంట్ అప్‌గ్రేడేషన్ ప్రాజెక్టును చేపట్టింది. ఇందులో భాగంగా టీటీఎల్ ప్రస్తుత పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా ముఖ్యంగా తమ కంపెనీకి సరిపడే వృత్తి నిపుణులను తయారుచేయడానికి ఆరు అధునాతన ట్రేడ్‌లను ఈ ఏసీటీల్లో ప్రవేశపెట్టనుంది. ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫాక్చరింగ్, మాన్యుఫాక్టరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమిషన్, మెకానిక్ ఎలక్ట్రికల్‌వెహికిల్స్, ఆర్టీషియన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైర్(మెకానిక్) వీటిలో ఉన్నాయి. ఇండస్ట్రియల్ రొబొటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫాక్చరింగ్, మాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమిషన్‌లో ఒక్కొక్క దానిలో 40 సీట్లు, మిగతా కోర్సుల్లో 48 సీట్ల చొప్పున ఉంటాయి. ఏటీసీల ఏర్పాటుకు అవసరమైన భవనాలను ఒక్కొక్క దానిని రూ.4.50కోట్ల వ్యయంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తుండగా రూ.35కోట్లతో ఏటీసీల్లో అధునాతన బోధనా పరికరాలను సమకూరుస్తున్నది.

#### చేరుకున్న పరికరాలు

ఒకపక్క భవన నిర్మాణ పనులు జరుగుతుండగానే టీటీఎల్ ఏటీసీలో అమర్చాల్సి ఉన్న యంత్ర పరికాలను ఆయా ఐటీఐలకు పంపడం మొదలు పెట్టింది. ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుపాక్చరింగ్, మాన్యుఫాక్టరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమిషన్, మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికిల్స్, ఆర్టీషియన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైర్(మెకానిక్)కు సంబంధించిన రోబోటిక్స్ మిషిన్స్, డిజిటల్ కటింగ్స్ తదితర పరికరాలు వీటిలో ఉన్నాయి. వీటితో పాటు ఏటీసీలో ఒక అధునాతన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో కూడిన కంప్యూటర్ ల్యాబ్‌ను కూడా ఏర్పాటు చేస్తారు. ఇందులో 20 సిస్టమ్స్ ఉంటాయి. ఆటోమొబైల్‌కు కోర్సుకు సంబంధించి బ్యాట్రీ చార్జెస్ వెహికిల్ కూడా రానున్నది.

#### ఆలస్యంగా కాజీపేట ఐటీఐ ఏటీసీ పనులు

కాజీపేటలోని ఐటీఐకి సంబంధించిన ఏటీసీ పనులు 30 శాతం వరకే అయ్యాయి. ఈ ఐటీఐ ఆవరణలో తగినంత స్థలం లేకపోవడంతో మొదట్లో సమీపంలోని సోమిడిలో ఏర్పాటు చేయాలని భావించారు. ఇక్కడ నాలుగైదు చోట్ల ప్రభుత్వ స్థలాల ను పరిశీలించారు. కానీ, అనువైన స్థలం అందుబాటులో లేకపోవడంతో చివరికి దీనిని కూడా ములుగు రోడ్డులోని ఐటీఐ ఆవరణలోనే నిర్మించాలని నిర్ణయించారు. స్థలం ఎంపికలో జరిగిన జాప్యం వల్ల ఏటీసీ పనులు ఆలస్యంగా మొదలయ్యాయి.

## సర్వేయర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- నేటి నుంచి మూడు రోజుల పాటు నిర్వహణ
- 302 మంది అభ్యర్థులు హాజరు
- నేడు జీపీవోల పరీక్ష కూడా..
- హాజరుకానున్న 37 మంది అభ్యర్థులు

హనుమకొండ, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : లైసెన్స్‌డు సర్వేయర్ల పరీక్షలు ఆదివారం నుంచి మొదలవుతున్నాయి. ఈ పరీక్షలు మూడు రోజుల పాటు జరుగుతాయి. వీటితో పాటు గ్రామ పంచాయతీ అధికారుల(జీపీవో) పరీక్ష కూడా ఆదివారం జరుగనుంది. తెలంగాణ భూ భారతి చట్టం అమలులో భాగంగా గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికి లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది తెలిసిందే. ఇందులో భాగంగా బీటెక్, ఐటీఐ, సివిల్, పాలిటెక్నిక్ కోర్సులు అభ్యసించిన అభ్యర్థులకు అవకాశం కల్పించింది. జిల్లాలో 313 మంది దరఖాస్తులు చేసుకోగా, వీరిలో 302 మందిని అర్హులుగా గుర్తించారు. వీరికి గత మే 26 నుంచి జూలై 26 వరకు హసన్‌పర్తిలోని సంస్కృతి విహార్‌లో శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఆది, సోమ, మంగళ మూడు రోజులు పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందులో ఉత్తీర్ణులైన వారు లైసెన్స్‌డు సర్వేయర్లుగా ధృవీకరణ పొందిన వారుగా గ్రామాల్లో సర్వే విధులు నిర్వర్తించవచ్చు. ఈ విధానం వల్ల నిరుద్యోగులకు ఉపాధి అవకాశం కల్పించినట్లు అవుతోందని ప్రభుత్వం భావిస్తోంది.

### మూడు రకాల పరీక్షలు

అభ్యర్థులకు హాల్ టికెట్లు జారీ చేయడం పూర్తయిందని, హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ సీహెచ్.శ్రీనివాసులు తెలిపారు. పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుంది. మొదటి రోజు ఉదయం థియరీ, మధ్యాహ్నం ప్లాటింగ్ పరీక్ష ఉంటుంది. రెండో, మూడో రోజు కూడా ఉదయం, మధ్యాహ్నం రెండేసి చొప్పున ప్రాక్టికల్ పరీక్షలు ఉంటాయి. పరీక్షా కేంద్రం వద్ద భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. పరీక్షా కేంద్రంలో సీటింగ్ ఏర్పాట్లు కూడా పూర్తయ్యాయి. పరీక్షల నిర్వహణకు మొత్తం 13 గదులను కేటాయిచారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పరీక్షల కోసం 13 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చీఫ్ సూపరింటెండెంట్‌గా వ్యవహరిస్తారు. ఆగస్టు 1 నుంచి 10వ తేదీ వరకు జవాబు పత్రాల మూల్యాంకనం చేసి ఫలితాలను వెల్లడించనున్నారు. ఉత్తీర్ణులైన వారు మండల కేంద్రాల్లో 45 రోజులు అప్రెంటిస్‌షిప్ చేయాల్సి ఉంటుంది. అప్రెంటిస్‌షిప్ తర్వాతే లైసెన్స్‌డ్ సర్వేయర్లుగా ధృవీకరణ పత్రాలు ఇస్తారా? లేక పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వెంటనే ఇస్తారా? అనేది కూడా స్పష్టం కావాల్సి ఉంది.

### నేడు గ్రామ పాలనాధికారుల పరీక్ష

గ్రామ పాలనాధికారుల పరీక్ష(జీపీవో) కూడా ఆదివారం ఇదే ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌లో జరుగనుంది. ఇందుకోసం కూడా అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లా నుంచి ఈ పరీక్షకు 37 మంది హాజరుకానున్నారు. వారికి కూడా హాల్‌టికెట్లు జారీ చేయడం పూర్తయింది. వీరి పరీక్ష కూడా ఉదయం 10 గంటల నుంచి మొదలవుతుంది. భూ భారతి చట్టం అమలులో భాగంగా ప్రతీ రెవెన్యూ గ్రామానికి ఒక గ్రామ పాలనాధికారిని నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఏప్రిల్‌లో పూర్వ వీఆర్వో, వీఆర్ఏల నుంచి దరఖాస్తులను స్వీకరించిన విషయం తెలిసిందే. వీరికి మే 25న అర్హత పరీక్ష నిర్వహించి జూన్ 2 నుంచి సేవలు మొదలు పెట్టింది. మిగతా ఖాళీలకు నేరుగా ఉద్యోగ ప్రకటన జారీ చేసి భర్తీ చేసే ప్రక్రియలో భాగంగా దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు ఆదివారం పరీక్ష నిర్వహిస్తున్నారు.

## కూరల్లో రారాజు



- సాటిలేని అడవి బోడకాకరకాయ
- ఔషధ గుణాలు అధికం
- వ్యాధి నిరోధక శక్తి పెంపు
- కిలో రూ.200ల పైమాటే..
- నెల రోజులు మాత్రమే దిగుబడి
- విరివిగా కొంటున్న వినియోగదారులు

వరంగల్ వ్యవసాయం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : సంవత్సరంలో నెల రోజుల పాటు మాత్రమే అందుబాటులో ఉండే అడవి బోడ కాకర కాయ వచ్చేసింది. అత్యంత రుచిగా ఉండడంతో పాటు ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుండడంతో అందరూ ఇష్టంగా తింటారు. అందుకే దీనికి డిమాండ్ ఎక్కువ. ధర ఎక్కువ అయినప్పటికీ వినియోగదారులు కొనుగోలు చేస్తారు. ప్రస్తుతం మార్కెట్‌లో దీని ధర కిలో రూ.200ల పైనే పలుకుతోంది. ఇవి అటవీ ప్రాంతంలో మాత్రమే లభిస్తాయి. వర్షాకాలంలో మొదలయ్యే దగ్గు, దమ్ము, తుమ్ముల బారి నుంచి రక్షిస్తాయి.

### ఔషధ గుణాలు పుష్కలం..

బోడకాకర కాయలో ఔషధ గుణాలు పుష్కలంగా ఉన్నాయి. ఆరోగ్యానికి ఎంతో మేలు. వీటివల్ల ప్రయోజనాలేంటో చూద్దాం.

**జీర్ణ వ్యవస్థకు మేలు:** బోడ కాకరకాయలో ఫైబర్ అధికంగా ఉండడంతో జీర్ణక్రియ మెరుగవుతుంది. అజీర్తి, గ్యాస్, మలబద్ధకం వంటి సమస్యలను తగ్గిస్తుంది.

**రక్తపోటు నియంత్రణ:** ఇందులో ఉన్న పొటాషియం, మెగ్నీషియం వంటి ఖనిజాల వల్ల రక్తపోటును స్థిరంగా ఉంచుతుంది. ముఖ్యంగా హై బీపీ ఉన్న వారు ఈ కూరను వారానికి 2-3 సార్లు తీసుకోవచ్చు.

చెక్కర స్థాయిని తగ్గిస్తాయి: మధుమేహ వ్యాధిని నియంత్రించడంలో బోడకాకర కాయలు సహాయ పడుతాయి.

**యాంటీ ఆక్సిడెంట్ గుణాలు:** ఇందులో ఉండే ఫ్లావనాయిడ్లు, టానిన్లు శరీరంలో ఉన్న విష పదార్థాలను తొలగించడంలో సహాయ పడుతాయి. క్యాన్సర్ లాంటి వ్యాధులను నిరోధించడంలోనూ సహాయ పడుతాయి.

**ఇమ్యూనిటీ పెంపు:** ఇందులో ఉండే విటమిన్-సీ, ఐరన్, జింక్ లాంటి పోషకాలు శరీరంలో రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తాయి.

చర్మానికి మేలు: చర్మంపై ఉండే ఫంగల్ లేదా బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్లను తగ్గించడంలో సహాయ పడుతాయి. అలర్జీలు, రాషెస్ వంటి సమస్యల నుంచి విముక్తి లభిస్తుంది.

**తక్కువ కాలరీలు:** బరువు తగ్గాలనుకునే వారికి మంచి ఆహారం. తక్కువ కొవ్వు, తక్కువ కాలరీలు ఉండడం వల్ల డైట్‌లో చేర్చుకోవచ్చు.

#### సీజన్‌లో మంచి డిమాండ్ ఉంటుంది..

– వినోద్, వ్యాపారి



వర్షాకాలం వచ్చిదంటే అడవి బోడకాకరకాయ గురించి చాలా మంది ఎదురు చూస్తుంటారు. ఒక్క మాటలో చెప్పాలంటే బోడకాకరకాయ తింటే మాంసం తిన్నంత బరాబర్ అని అంటారు. నెల.. నెల పదిహేను రోజులు మాత్రమే దొరుకుతుంది. సత్తుపల్లి నుంచి దిగుమతి చేసుకుని కిలోపై రూ.20 నుంచి 50 లాభం చూసుకుని విక్రయిస్తాం. ఒక్కోరోజు క్వింటా బోడ కాకరకాయ అమ్ముతాం.

## వరి పొలాల్లో శ్రమైక సౌందర్యం

- ఉపాధి బాటలో పశ్చిమబెంగాల్, యూపీ, ఉత్తరాఖండ్, ఎంపీ, బిహార్, జార్ఖండ్ కూలీలు
- కాటారం డివిజన్‌కు వందలాది మైళ్ల దూరం నుంచి వరినాట్ల కోసం రాక
- ఉదయాన్నే వంటలతో సహా పొలాలకు వెళ్లి పనులు
- పురుషులే వేగంగా నాట్లు వేయడం మరో ప్రత్యేకత

కాటారం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : కాటారం డివిజన్ వరి పొలాల్లో భిన్నత్వంలో ఏకత్వంలా 'మినీ భారత్'ను చూస్తున్నారనే దానిలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఉత్తర, మధ్య, తూర్పు భారత దేశ రాష్ట్రాలకు చెందిన వారు ఉపాధి కోసం వందలాది మైళ్ల దూరం కుటుంబాలతో సహా కొందరు, భార్య పిల్లలను వదిలి మరికొందరు తరలిరావడం కనిపిస్తోంది. ఉన్న ఊరు వదిలి.. ఉపాధి కోసం కదిలి.. సీజనల్ ఉపాధి అవకాశాల కోసం కాటారం, మల్హర్ తదితర మండలాల్లోని పల్లెలకు వందలాది మంది పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, బిహార్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, ఒడిశా తదితర రాష్ట్రాల కూలీలు పొలాల బాట పట్టడం విశేషం. కోల్‌కత్తా, నైనిటాల్, నలంద, ఉద్ధంసింగ్‌నగర్, సాత్నా తదితర ప్రాంతాల నుంచి వారు రైళ్లలో వందలాది కిలోమీటర్లు ప్రయాణించి నాట్లు వేసే ఉపాధి బాట పట్టారు. ఆడ, మగ అనే తేడా లేకుండా అందరు నాట్లు వేయడంలో సిద్ధహస్తులు. బ్యాచ్‌లవారీగా వచ్చిన వారిలో పురుషులు 95 శాతం ఉండగా, వరి నాట్లు వేగంగా, కొలతలు తీసినట్లు వేయడం మరో ప్రత్యేకత.

### ఉత్తర, మధ్య, తూర్పు భారత్ రాష్ట్రాల నుంచి రాక..

కాటారం డివిజన్‌లోని పలు మండలాల్లో వరి నాట్లు వేయడానికి పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని ఉత్తర, దక్షిణ 24 పరగణాల జిల్లాలు, ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని ఉద్ధంసింగ్‌నగర్, నైనిటాల్, బిహార్ రాష్ట్రంలోని నలంద, గయ, మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని సాత్నా, జార్ఖండ్ రాష్ట్రంలోని చోటా నాగపూర్ తదితర ప్రాంతాల నుంచి బృందాలుగా పలువురు కూలీలు వచ్చారు. సుమారు 1000-1400 కిలోమీటర్ల దూరం నుంచి వచ్చి అలుపు సొలుపు లేకుండా పనులు చేస్తున్నారు. స్థానికులు కొందరు మధ్యవర్తుల సాయంతో కూలీలను రప్పించారు. బ్యాచ్‌ల వారీగా పలువురు కూలీలు వచ్చి వరినాట్లు వేస్తున్నారు. ఒక్కో బృందంలో 14-18 మంది ఉండగా అందులో చాలా మంది పురుషులే కావడం విశేషం. అధిక బృందాల్లో మగ కూలీలే ఉన్నారు. మగ కూలీలు కొలతలు తీసి తాళ్లు కట్టి అత్యంత వేగంగా నాట్లు వేయడం గమనార్హం. తెలంగాణ రాష్ట్రంలో అధిక శాతం మహిళలు నాట్లు వేస్తే పురుషులు నారును మోసి మడుల్లో వేస్తున్నారు. పలు రాష్ట్రాలకు చెందిన మగ కూలీలు మాత్రం మడిలో నారును తీసిన సమయంలోనే ఎవరికి వారే కుచ్చెలుగా చేసుకుని వాటికి రబ్బరు బ్యాండ్లు, నార, గడ్డి తాళ్లు కట్టి వారే తెచ్చుకుని నాట్లు వేస్తుండడం ప్రత్యేకత.





వరినారు తీసి కుచ్చెలు కడుతున్న పశ్చిమబెంగాల్ కూలీలు

### ఉదయాన్నే రంగంలోకి..

స్థానికంగా గ్రామాల్లో ఉండే కూలీలు ఉదయం 9-10 గంటల మధ్య నాట్లు వేయడానికి ఇళ్ల నుంచి బయలుదేరుతుంటారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలు మాత్రం ఉదయం 6 గంటలకే పొలాలకు చేరుకుంటున్నారు. వేప పుల్లలు, బ్రష్‌లతో పళ్లు తోముకుని వచ్చి ఒక్కో బిస్కెట్ ప్యాకెట్ తిని పనిలోకి 6.30 గంటలకు దిగుతున్నారు. తాము బస చేసిన చోట తెల్లవారుజామునే లేచిన కూలీలు కాలకృత్యాలు తీర్చుకుని భారీ వంట పాత్రల్లో అన్నం, కూరలు వండుకుని వంటలతో సహా కొందరు నాట్లు వేయడానికి వస్తుండగా, చాలా మంది కూలీలు ఉదయాన్నే పొలాల్లో దిగుతుండగా బస వద్ద ఉన్న వంట మనిషి వంట చేసుకుని భోజనాన్ని నాట్లు వేసే చోటికి తేవడం కనిపిస్తోంది. అందరు కలిసి నారు మడిలో నారు తీసిన వెంటనే కట్టలు కట్టి సంచుల్లో మడుల వద్దకు తీసుకెళ్లి నాట్లు వేస్తున్నారు. భోజన విరామం తప్ప అలుపన్నదే లేకుండా సాయంత్రం 5 గంటల వరకు పనులు చేస్తున్నారు. కాగా, కూలీలను రప్పించిన మధ్యవర్తులు వరినాట్లు వేయించే పొలాల యజమానులతో మాట్లాడి కూలీలను తమ ఆటోల్లో పొలాల వద్ద దింపేసి వెళ్తున్నారు. కూలీల బృందాలకు వంట సామగ్రి, నిత్యావసరాలు అందిస్తున్న వారు ఎకరానికి కొంత కమీషన్ తీసుకుంటూ మిగతా డబ్బులు కూలీలకు చెల్లిస్తున్నట్లు సమాచారం. కాగా తాము వేసిన నాట్లకు సంబంధించిన కూలీ డబ్బు లెక్కలు రెండు మూడు రోజులకోసారి చేయడం జరుగుతుందని కూలీల బృందాల నాయకులు తెలిపారు.

#### నెలలో రూ.40వేల వరకు వస్తాయి..



కోల్‌కత్తా సమీపంలోని గ్రామం నుంచి నాట్లు వేయడానికి వచ్చాం. ఈ ప్రాంతానికి గతేడాది నుంచి వస్తున్నాం. నెలలో నాట్లు వేస్తే కూలీ డబ్బులు రూ.30వేల నుంచి రూ.40వేలు వస్తాయి. డబ్బులను ఫోన్ పే ద్వారా ఇళ్లకు పంపిస్తాం.

– గోవింద్‌రాయ్, కూలీ, దక్షిణ 24 పరగణాల జిల్లా, పశ్చిమబెంగాల్



పొలంలో తాళ్లు కట్టి నాటు వేస్తున్న ఉత్తరాఖండ్ పురుషులు

### ఐదెకరాల నాటుకు 10-12 మంది కూలీలే..


స్థానికంగా కూలీలు వరి నాట్లు వేయడంలో ఎకరాకు ఐదుగురు, ఆరుగురు అవసరం పడుతుంటారు. కానీ, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన మగ కూలీలు ఎకరాకు ఇద్దరు, ముగ్గురు చొప్పున నాట్లు వేస్తున్నారు. ఐదెకరాల పొలంలో నాట్లు 10 నుంచి 12 మంది కూలీలే వేయడం గమనార్హం. కాగా, ఈ కూలీలు మడుల్లో తాళ్లు కట్టి లైన్ కొద్దీ నాట్లు వేస్తున్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు చెప్పినట్లుగా తూర్పు, పడమర దిక్కుల్లో కాలి బాటలు వదిలి నాట్లు వేయడం జరుగుతోంది. ఒక్కో బృందం 8-9 ఫీట్ల పొడవు, 8-9 ఫీట్ల వెడల్పు స్థలంలో 144-156 కుదుళ్ల వచ్చేలా నాట్లు వేస్తున్నారు. పొలాల యజమానులు వెంట ఉండి తమకు నచ్చిన రీతిలో నాట్లు వేయించడం జరుగుతోంది.

#### 1,400 కి.మీ. దూరం నుంచి వచ్చాం..



ఉపాధి బాటలో నాట్లు వేయడానికి 1,400 కిలోమీటర్ల దూరం నుంచి రైళ్లలో 26 గంటలు ప్రయాణం చేసి వచ్చాం. నాట్లు వేగంగా, ఖచ్చితమైన కొలతలతో వేస్తాం. బ్యాచ్‌లో 14 మంది ఉండగా 13 మంది నాట్లు వేస్తే, ఒక మనిషి వంట చేయడానికి ఉంటాడు. ఉదయం 6గంటలకే పొలం వద్దకు వచ్చి పనులు మొదలెడతాం.

– నిశికాంత్ దాలీ, ఉద్ధంసింగ్‌నగర్ జిల్లా, ఉత్తరాఖండ్



# ప్రాజెక్టులకు కొనసాగుతున్న ప్రవాహం



తుపాకులగూడెంలోని సమ్మక్క బ్యారేజీ నుంచి దిగవకు వెళ్తున్న నీళ్లు

మహదేవపూర్ రూరల్ జూలై 26 (ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. శనివారం బ్యారేజీకి వచ్చే ఇన్‌ఫ్లో 3.41లక్షల క్యూసెక్కులుగా నమోదుకాగా గేట్లన్నీ ఓపెన్ చేసి, వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద గోదావరి నది 4.70 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది.

### తగ్గిన గోదావరి మట్టం

మహదేవపూర్ (ఆంధ్రజ్యోతి): మహదేవపూర్ మండలం కాళేశ్వరం వద్ద గోదావరి ఉధృతి శనివారం తగ్గింది. ఎగువ నుంచి మహారాష్ట్రలో వర్షాలు తగ్గడంతో ప్రవాహం తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం 7.6 మీటర్ల ఎత్తుతో గోదావరి ప్రవహిస్తోంది.

### సమ్మక్క సాగర్, పాలెం ప్రాజెక్టుల్లో..

కన్నాయిగూడెం/వెంకటాపురం (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని సమ్మక్క సాగర్ ప్రాజెక్టు 35 గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ నీటి సామర్థ్యం 6.94 టీఎంసీలు కాగా శనివారం సాయంత్రం 5 గంటల వరకు 4.075 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 4,74,500 క్యూసెక్‌లు కాగా 5,25,740 క్యూసెక్‌ల నీరు విడుదల చేస్తున్నారు. మొత్తం 59 గేట్లకు 35 గేట్లు తెరుచుకున్నట్లు అధికారులు తెలిపారు. వెంకటాపురం మండలంలోని పాలెం ప్రాజెక్ట్ కెపాసిటీ 1258.82 ఎంసీఎఫ్‌టీ కాగా ప్రస్తుతం 688.28 ఎంసీఎఫ్‌టీ నీరు ఉంది. 124.60 మీటర్ల నీటిమట్టం నమోదైంది. ఇన్‌ఫ్లో 450 క్యూసెక్‌లు ఉండగా అంతే నీటిని విడుదల చేస్తున్నట్టు అధికారులు వెల్లడించారు. మొత్తం నాలుగు గేట్లకు అన్నింటినీ తెరిచి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు.

### వరద సహాయక చర్యల్లో అధికారులు ముందుండాలి

ఏటూరునాగారం (ఆంధ్రజ్యోతి): మండలంలోని వరద ముంపు ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకూండా రెవెన్యూ అధికారులు, సిబ్బంది తక్షణ చర్యలు చేపట్టి, సహాయక చర్యల్లో ముందుండాలని అదనపు కలెక్టర్ మహేందర్‌జీ అన్నారు. ములుగు ఆర్డీవో వెంకటేశ్వర్లుతో కలిసి ముందుగా మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన అధికారులతో మాట్లాడుతూ ప్రధానంగా వర్షాలు కురుస్తున్నందున మండలంలోని ఆయా వాగవతలి గ్రామాల ప్రజలకు సరిపడా నిత్యావసర సరుకులు పంపిణీ చేసే బాధ్యత రెవెన్యూ అధికారులదేనని తెలిపారు. వరదలు సంభవించినట్లయితే ముంపు ప్రాంతాలైన కొండాయి-దొడ్ల జంపన్నవాగు వద్ద రెండు బోట్లు అంతేవిధంగా ఎలిశెట్టిపల్లిలో ఒక బోటు ఏర్పాటు చేశామని తెలిపారు. భూభారతి పథకంలో రైతులు పట్టాల కోసం చేసుకున్న దరఖాస్తులను అధికారులు త్వరిగతిన పరిశీలించాలని అదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ జగదీశ్వర్, ఆర్ఐ కిరణ్ ఉన్నారు.

## మత్తడి పోస్తున్న చెరువులు



మత్తడిదుముకుతున్న గూడెపు చెరువు

కాటారం, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలంలో తెరపిలేకుండా వర్షం కురుస్తుండటంతో అంతా అతలాకుతలంగా తయారైంది. శుక్రవారం రాత్రి, శనివారం ఎడతెగని వర్షంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. సుమారు 6 సెం.మీ పైగా వర్షపాతం నమోదు కావడంతో లోతట్టు ప్రాంతాలన్నీ వరద నీటితో జలమయమయ్యాయి. రేగులగూడెం, గోపాల్‌పూర్ సమీపంలోని వాగు ఉప్పొంగడంతో పొలాలన్నీ వరదనీటితో చెరువుల్లాగా కనిపిస్తున్నాయి. పలువురు రైతులకు చెందిన వరి నార్లు నీటమునిగాయి. పలుగ్రామాల పరిధిలో వాగులు, వంకలు పొంగి పత్తి చేలల్లోకి వరద నీరు చేరడంతో నష్టం వాటిల్లే అవకాశాలున్నాయి. కాగా వానాకాలం సీజన్‌లో వరి నాట్లు వేయడానికి భారీ వర్షాలు దోహదపడుతాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షానికి పలు ప్రాంతాల్లోని చిన్న, పెద్ద చెరువులు పూర్తిగా నిండి మత్తళ్ళు దుముకుతున్నాయి. భారీ ఆయకట్టు గల చింతకాని పరిధిలోని గూడెపు చెరువు రెండు మత్తళ్లు దుముకుతుండటంతో వలలు వేసి పలువురు చేపలను పట్టడం కనిపించింది.

## మహితాపురం జలపాతం వద్ద చిక్కుకున్న విద్యార్థులు

వెంకటాపురం, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహితాపురం జలపాతాన్ని తలకించేందుకు వచ్చిన విద్యార్థులు అడవిలో తప్పిపోయిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. వరంగల్ నిట్ కాలేజీకి చెందిన ఏడుగురు ఇంజనీరింగ్ విద్యార్థులు మహితాపురం జలపాతం సందర్శనకు వచ్చారు. గూగుల్ మ్యాప్ సహాయంతో అక్కడికి వెళ్లారు. ఈ క్రమంలో తిరిగి వచ్చేటప్పుడు చీకటి పడటంతో అడవిలో తప్పిపోయారు. దీంతో డయల్ 100కు ఫోన్ చేయటంతో అప్రమత్తమైన వెంకటాపురం పోలీసులు అటవీ శాఖ సిబ్బందికి సమాచారం అందించారు. తప్పిపోయిన విద్యార్థుల కోసం పోలీసులు, అటవీ శాఖ సిబ్బంది మహితాపురం అడవిలో జోరు వర్షంలోనూ గాలించారు. చివరకు వారి ఆచూకీ లభించడంతో ఊపిరి పీల్చుకున్నారు. విద్యార్థులను సురక్షితంగా అడవి నుంచి బయటకు తీసుకొచ్చారు.

# వదలని వాన

(5వ పేజీ తరువాయి)

వాన కురిసినప్పటికీ శనివారం ఉదయం నుండి ఎడతెరపి లేకుండా భారీగానే పడింది. దీంతో జిల్లా వ్యాప్తంగా 24.6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మహదేవపూర్ మండలంలో 1.07, పలిమెలలో 3.2, మహాముత్తారం 1.01, కాటారం 3.0, మల్హర్ 1.5, చిట్యాల 2.2, టేకుమట్ల 2.1, మొగుళ్లపల్లి 2.2, రేగొండ 2.6, గణపురం 1.9, భూపాలపల్లి 2.6, కొత్తపల్లిగోరి మండలం 1.5 సెంటీమీటర్ల వర్షం పడిందని అధికారులు తెలిపారు. జిల్లాలో సగటున 2.24 సెంటీ మీటర్లు వర్షపాతం నమోదైంది. వర్షంతో వాగులు, వంకలు, చెరువుల్లో జలకళ సంతరించుకుంది.

### బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

భూపాలపల్లి ఏరియాలో నాలుగు భూగర్భ గనులు, రెండు ఓసీలు ఉన్నాయి. వర్షం కారణంగా బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. గడిచిన ఐదు రోజుల్లో సుమారు రూ.15 కోట్ల మేర నష్టం వాటిల్లినట్టు సింగరేణి అధికారులు అంచనా వేస్తున్నారు. రోజుకు 6వేల మెట్రిక్ టన్నుల నష్టం వస్తోందని తెలిపారు. సాధారణ రోజుల్లో 10వేల మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేస్తే ప్రస్తుతం కేవలం 4వేల మెట్రిక్ టన్నుల్లో అతి కష్టమ్మీద అవుతోందని వివరించారు. ఐదో రోజు వర్షం మరింత అధికం కావడంతో బొగ్గు వెలికితీతకు తీవ్ర అంతరాయం ఏర్పడి ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. అలాగే జెన్కో ఆధ్వర్యంలో నడిచే తాడిచర్ల ఓసీపీలోనూ బొగ్గు తవ్వకాలకు తీవ్ర అంతరాయం ఏర్పడినట్లు తెలిసింది. అక్కడ కూడా ఐదు రోజులుగా ఉత్పత్తి నిలిచిపోయింది.

### సంతరించుకున్న జలకళ

జిల్లా వ్యాప్తంగా విరామం లేకుండా కురుస్తున్న వర్షాలతో చెరువులు, వాగుల్లో జలకళ సంతరించుకుంటుంది. భూపాలపల్లి మండలంలోని పంబాపూర్‌లో ఉన్న భీమ్‌ఘన్‌పూర్ చెరువులోకి భారీగా వరద నీరు చేరి నిండుకుండలా కనిపిస్తోంది. మోరంచపల్లి వాగులోకి సైతం నీరు చేరింది. ఈ సమీప ప్రాంతాల్లోని పంట పొలాలు నీట మునిగాయి. గణపురం చెరువు 30 ఫీట్లకు గాను 15 ఫీట్లకు నీరు చేరుకుంది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి.

## తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన సబ్ కలెక్టర్



తాడిచర్లలో రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

మహాముత్తారం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని శనివారం కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్ సందర్శించారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. భూభారతి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని తహసీల్దార్ డి.శ్రీనివాస్, సిబ్బందిని ఆదేశించారు. అనంతరం కస్తూర్బా పాఠశాల ఆవరణలో నిర్మిస్తున్న భవనాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాసరావు ఉన్నారు.

### భూ భారతిపై సమీక్ష

మల్హర్ (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన తాడిచర్ల తహసీల్దార్ కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ సందర్శించారు. ఈ సందర్భంగా భూభారతిపై సమీక్ష నిర్వహించారు. రైతులకు నోటీసులు ఇవ్వడంతో పాటు మోకా సర్వే పనుల్లో వేగం పెంచాలన్నారు. మంత్రి పర్యటన నేపథ్యంలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న గ్రంథాలయ భవనాన్ని, పీఏసీఎస్ కార్యాలయాన్ని పరిశీలించారు. ఆయన వెంట పీఏసీఎస్ ఛైర్మెన్ ఇప్ప మొండయ్య, తహసీల్దార్ రవికుమార్, నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

## సీజనల్ వ్యాధులతో జాగ్రత్త : డీపీవో

మల్హర్, జూలై 26(ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటిస్తూ పారిశుధ్య పనులు ముమ్మరం చేయాలని డీపీవో వీరభద్రయ్య అన్నారు. మండల కేంద్రమైన తాడిచర్లలో సాగుతున్న పారిశుధ్య పనులను ఆయన శనివారం పరిశీలించారు. తాగునీరు కలుషితం కాకుండా పైప్‌లైన్ లీకేజీలు మరమ్మతులు చేయాలన్నారు. వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. ఆయన వెంట కార్యదర్శి మల్లికార్జున్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు

### పలువురికి గాయాలు



సంఘటన స్థలంలో ఆర్టీసీ బస్సు, కారు

చిట్యాల, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపేట శివారులో ఆర్టీసీ బస్సును కారు ఢీకొనడంతో పలువురు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా జమ్మికుంట నుంచి ఆర్టీసీ బస్సు భూపాలపల్లికి వెళ్తుండగా అదే సమయంలో మండలంలోని నైన్‌పాక, జడల్‌పేట ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వర్తించే ఉపాధ్యాయులు హనుమకొండ నుంచి కారులో వస్తున్నారు. ఈక్రమంలో కొత్తపేట గ్రామ మలుపు వద్ద ఆర్టీసీ బస్సును కారు ఢీకొంది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న సావటి చంద్రయ్య, కారులో ప్రయాణిస్తున్న ఉపాధ్యాయులు ప్రవీణ్, పావనికి తీవ్ర గాయాలు అయ్యాయి. రఘు స్వల్పంగా గాయపడ్డాడు. క్షతగాత్రులను భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రిలో చేర్పించారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

## చికిత్స పొందుతూ యువకుడి మృతి

చిట్యాల, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని అందుకుతండాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిసిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సంగ దేవేందర్ (25) తల్లిదండ్రులు మృతి చెందడంతో సోదరుడు అజయ్‌తో కలిసి ఉంటున్నాడు. దేవేందర్‌కు ఇల్లంతకుంట మండలం బూజునూరుకు చెందిన కోమలలో నాలుగు నెలల క్రితం వివాహం జరిగింది. కొంత కాలం అందరూ కలిసి ఉండగా రెండు నెలలుగా దేవేందర్‌ను వేరు కాపురం పెట్టాలని అత్తింటివారు ఒత్తిడి తెచ్చారు. ఈక్రమంలో ఈనెల 24న ఇంటి వద్ద గొడవ జరగడంతో మనస్తాపానికి గురైన దేవేందర్ ఇంట్లో ఉన్న పురుగుల మందుతాగాడు. దీంతో కుటుంబ సభ్యులు హనుమకొండ జిలత్ల పరకాలలోని ఓప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స అందిస్తుండగానే దేవేందర్ మృతి చెందాడు. మృతుడి సోదరుడు అజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్ కుమార్ తెలిపారు.

## వర్షాలతో కూలిన ఇల్లు



కూలిన ఇంటి వద్ద వృద్ధ దంపతులు

వాజేడు, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఏకదాటిగా కురుస్తున్న వర్షాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో మండలంలోని ఏడ్జర్లపల్లిలో చింతా సమ్మయ్యకు చెందిన ఇల్లు పూర్తిగా కూలిపోయింది. దీంతో ఆ కుటుంబం నిరాశ్రయులైంది. పెంకుటింట్లో నివాసం ఉంటున్న సమ్మయ్య దంపతులు శనివారం ఒక్కసారిగా ఇల్లు కూలుతుండటంతో బయటకు వచ్చి ప్రాణాలు దక్కించుకున్నారు. విషయం తెలుసుకున్న రెవిన్యూ, పంచాయతీరాజ్ అధికారులు ఆ దంపతులను పునరావాస కేంద్రంలో చేర్పించి ఆశ్రయం కల్పించారు.

# ఉనికి కోసమే మధు స్వార్థ రాజకీయాలు

### టీపీసీసీ మహిళా ఉపాధ్యక్షురాలు సుగుణ

కాటారం, జూలై 26(ఆంధ్రజ్యోతి): రాజకీయ ఉనికి కోసం పుట్ట మధు స్వార్థ రాజకీయాలు చేస్తున్నారని టీపీసీసీ మహిళా ఉపాధ్యక్షురాలు అంగోత్ సుగుణ విమర్శించారు. మండల కేంద్రంలో శనివారం మహిళా కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. మధు తన రాజకీయ స్వార్థం కోసం కాటారంలో ఎంబీబీఎస్ విద్యార్థినికి ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయ కుల నుంచి డబ్బులు వసూలు చేసి సాయం అందించినట్లు చెప్పుకుంటూ మంత్రి శ్రీధర్‌బాబు కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి, సంక్షేమబాటలో నడిపిస్తూ ఎంతోమందికి సాయం చేసిన బయటికి చెప్పుకోని శ్రీధర్‌బాబుపై అనుచిత వ్యాఖ్యలు చేయటం సిగ్గుచేటన్నారు. ఈ సమావేశంలో మహిళా కాంగ్రెస్ నాయకులు బెడిక లక్ష్మి, సారక్క, అమృత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కిస్సా కుర్సికా

(5వ పేజీ తరువాయి)

పోరు దృష్ట్యా ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేయడం రాజకీయంగా ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. వచ్చే ఎన్నికల్లో టికెట్‌పై కన్నేసిన ఇటు గండ్ర వెంకటరమణారెడ్డి, అటు సిరికొండ మధుసూదనాచారి ఎవరికి వారుగా కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ గ్రూపుల వ్యవహారం పార్టీకి తలనొప్పిగా మారే పరిస్థితి ఉందన్న అంచనాకు వచ్చిన అధిష్ఠానం వీలైనంత తొందరగా జిల్లాలో సమస్యను పరిష్కరించడం ద్వారా నేతల మధ్య సయోధ్య కుదుర్చి ఆధిపత్య పోరాటానికి తెరదించే ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే కేటీఆర్ ఆదివారం భూపాలపల్లి జిల్లా పర్యటనకు వస్తున్నారని అంటున్నారు. పర్యటనలో భాగంగా మొగుళ్లపల్లి, చిట్యాల మండలాల్లో పర్యటించి మధ్యాహ్నం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తలతో కేటీఆర్ సమావేశమవుతారు. ఈ క్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి ఎవరనే దానిపై స్పష్టతనిచ్చే అవకాశం ఉందని సమాచారం. దీంతోపాటు రాబోయే రోజుల్లో పార్టీ నిర్వహించనున్న కార్యక్రమాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేసే అవకాశం ఉందంటున్నారు. మొత్తమ్మీద భూపాలపల్లి నియోజకవర్గంలో కొంతకాలంగా బీఆర్ఎస్‌లో కొనసాగుతున్న ఆధిపత్య పోరుకు కేటీఆర్ ఫుల్‌స్టాప్ పెట్టే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది.

## మానేరు నదిపై వంతెన

### పెద్దపల్లి జిల్లాకు కనెక్టివిటీకి ప్రతిపాదనలు

కాటారం, జూలై 26(ఆంధ్రజ్యోతి):గోదావరి నది ఉప నది అయన మానేరు నదిపై మరో వంతెన నిర్మాణం కానుంది..పెద్దపల్లి జిల్లాకు కాటారం మండలానికి నేరుగా కనెక్టివిటీ చేసి దూరభారం తగ్గించడానికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చొరవతో ఈ బ్రిడ్జి ఏర్పాటు కోసం ఆర్‌అండ్‌బీ అధికారులు పలు ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపించారు. సుమారు రూ.120కోట్లకు పైగా నిధులతో వంతెన నిర్మాణ ం కోసం ప్రతిపాదించగా ప్రభుత్వం త్వరలో ఆమోదం తెలపనున్నట్లు సమాచారం. పెద్దపల్లి జిల్లా మంథని మండలంలోని స్వర్ణపల్లి లేదా వెంకటాపూర్ లేదా ఆరెంద గ్రామాల సమీపం నుంచి కాటారం మండలంలోని గంగారం లేదా దామెరకుంట వరకు మానేరు నదిపై వంతెన నిర్మాణానికి ప్రతిపాదించినట్లు అధికారవర్గాలు తెలిపాయి. సుమారు 1 కి. మీ మేర పొడవున మానేరునదిపై బ్రిడ్జి నిర్మాణం జరిగితే ప్రముఖ పుణ్య క్షేత్రమైన కాళేశ్వరం వెళ్లడానికి దూరభారం తగ్గనుంది. సుమారు 50ఏళ్ల క్రితం సోమన్‌పల్లి వద్ద బ్రిడ్జి నిర్మాణం జరగకముందు మండల ప్రజలు మానేరు నది దాటి ఆరెంద నుంచి ఆర్టీసీ బస్సుల ద్వారా నియోజకవర్గ, జిల్లా కేంద్రాలైన మంథని, కరీంనగర్ లకు వెళ్లేవారు. మానేరు నదిపై వంతెన నిర్మాణం కోసం ప్రతిపాదించినట్లు తెలియడంతో పలువురు పాత రోజులను గుర్తుకుచేసుకుంటున్నారు.

## డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టాలి

### నార్కోటిక్స్ బ్యూరో డీఎస్పీ సైదులు

గోవిందరావుపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): యువత భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్న డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టాలని నార్కోటిక్స్ బ్యూరో డీఎస్పీ సైదులు అన్నారు. మండలంలోని పస్రానాగారం జడ్పీహెచ్ఎస్ విద్యార్థులతో శనివారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న డ్రగ్స్ రహిత తెలంగాణ లక్ష్యంగా యువత ఉద్యమించాలన్నారు. విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్‌ను ఎవరైనా అమ్మినా, కొనుగోలు చేసినా తక్షణమే వారి వివరాలను 1908 టోల్‌ఫ్రీ నెంబర్‌కు సమాచారం అందించాలన్నారు. అనంతరం డ్రగ్స్ రహిత సమాజం కోసం ఉద్యమిస్తామంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.శ్రీనివాస్, సబ్ ఇన్‌స్పెక్టర్ మొగిలి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా మహాసభను విజయవంతం చేయాలి : సీపీఐ

వెంకటాపురం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాకేంద్రంలో ఆగస్టు 5న జరిగే సీపీఐ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఆపార్టీ జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు కోరారు. మండలకేంద్రంలో శనివారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మహాసభలో నిర్వహించాల్సిన ప్రజా ఉద్యమాలపై చర్చించడం జరుగుతుందని అన్నారు. మహాసభకు అన్ని ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు.

## పాఠశాలలను తనిఖీ చేసిన డీఈవో

గోవిందరావుపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యా శాఖ అధికారి దురిశెట్టి చంద్రకళ శనివారం మండల కేంద్రంలోని బాలికల జడ్పీహెచ్ఎస్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని పలు రికార్డులను పరిశీలించి తరగతిగదులను సందర్శించారు. విద్యార్థులకు కల్పిస్తున్న వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను సబ్జెక్టులవారీగా ప్రశ్నలు అడిగి సంతృప్తి వ్యక్తంచేశారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ సక్రమంగా విధులకు హాజరుకావాలని, విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్యను అందించాలని అన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచేవిధంగా కృషి చేయాలని సూచించారు. ఆమె వెంట స్కూల్ కాంప్లెక్స్ మండల నోడల్ అధికారి సోమారెడ్డి, జడ్పీహెచ్ఎస్ ఇన్‌చార్జి హెచ్ఎం అన్నామేరీ, ఎంపీపీఎస్ హెచ్ఎం రఘురాం, ఉపాధ్యాయులు రేణుక, హరిత, ప్రవళిక, అశ్విని, రమేష్, ఎమ్మార్సీ విష్ణు ఉన్నారు.

## తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ఆర్డీవో

మంగపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీవో ఎన్. వెంకటేశ్ శనివారం సందర్శించారు. పలు రికార్డులను, ఉద్యోగులు హాజరు పట్టికను పరిశీలించారు. భూ సమస్యల పరిష్కారానికి పాటించాల్సిన మార్గదర్శకాలను అధికారులకు వివరించారు. ఆయన వెంట తహసీల్దార్ తోట రవీందర్, నాయబ్ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావు, ఆర్ఐలు శ్రీనివాస్, ఏసుపాదం ఉన్నారు.

## ఘనంగా యూత్ కాంగ్రెస్ కార్యదర్శి జన్మదిన వేడుకలు

మంగపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మంత్రి సీతక్క తనయుడు కుంజా సూర్య జన్మదిన వేడుకలను ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. మంగపేటలోని కస్తూర్బా అనాథాశ్రమంలో వృద్ధుల సమక్షంలో కేక్‌ను కట్‌చేసి పండ్లు, స్వీట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మైల జయరామిరెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చెట్టుపెల్లి వెంకటేశ్వర్లు, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొడేల నరేష్, జిల్లా మీడియా ఇన్‌చార్జి నాగేంద్రబాబు, మహబూబాబాద్ పార్లమెంట్ యువజన కాంగ్రెస్ కో ఆర్డినేటర్ కారుపోతుల మణి వర్మ, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు బోడ జయరాజ్, యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కుర్సం రమేష్, బాడిశ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన వర్సిటీ భూములను వ్యాపార సముదాయాలకు కేటాయించొద్దు

వెంకటాపూర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ములుగులోని గిరిజన విశ్వవిద్యాలయానికి సేకరించిన భూములను ఇతర వ్యాపార సముదాయాలకు కేటాయిస్తే సహించేది లేదని జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) రాష్ట్ర అధ్యక్షుడు మొగుళ్ల భద్రయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యూనివర్సిటీ భూముల్లో పెట్రోల్‌బంకు వంటి వ్యాపార సముదాయాలు నిర్మించే ప్రయత్నాలు చేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. గిరిజన యూనివర్సిటీ కోసం చాలామంది దళిత, గిరిజన నిరుపేదలు తమ భూములను ఇచ్చి ప్రభుత్వానికి సహకరించారని గుర్తు చేశారు.

## ద్విచక్ర వాహనం దగ్ధం

వాజేడు, జూలై 26(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం దగ్ధమైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఏడ్జర్లపల్లికి చెందిన వాసం ఆదినారాయణకు చెందిన హోండా షైన్ బైకు శనివారం ఇంటి వద్ద స్టార్ట్ చేస్తుండగా ఒక్కసారిగా మంటలు వ్యాపించి దగ్ధమైంది. ఏడు నెలల క్రితమే కొత్త బైకు తీసుకున్నానని, ఇలా ఎందుకు జరిగిందో అర్థం కావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు. దీనిపై వాజేడు పోలీసులు విచారణ నిర్వహించాలని కోరాడు. సుమారు రూ. 1.20 లక్షలతో బైకు కొనుగోలు చేసి, ఇలా నష్టపోయానని తెలిపాడు. వర్షాకాలంలో బైకు కాలిపోవడం ఏమిటని, దీని తయారీలో ఏమైనా లోపం ఉందా? అని ప్రశ్నిస్తున్నాడు.

## మద్యం షాపుల నిర్వహణకు పెసా గ్రామ సభలు

వెంకటాపురం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నూగూరు, వెంకటాపురం, బీసీమల్రిగూడెం, వీఆర్కేపురం పంచాయతీ కార్యాలయాల్లో శనివారం మద్యంషాపుల నిర్వహణకు అధికారులు పెసా గ్రామసభలు నిర్వహించారు. నూగూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో జరిగిన గ్రామసభకు కోరం పూర్తిస్థాయిలో లేకపోవడంతో అధికారులు గ్రామసభను వాయిదా వేశారు. వెంకటాపురం గ్రామసభకు 339మంది సభ్యులకు 113మంది హాజరయ్యారు. బీసీమల్రిగూడెం గ్రామసభకు 130మంది సభ్యులకు 61మంది, వీఆర్కేపురం గ్రామసభకు 130మందికిగాను 70మంది సభ్యులు హాజరయ్యారు. మూడు గ్రామసభల్లో మద్యంషాపుల నిర్వహణకు సభ్యులు ఆమోదం తెలిపారు.

## భూ భారతి దరఖాస్తులను క్లియర్ చేయాలి

### అడిషనల్ కలెక్టర్ మంహేందర్ జీ

కన్నాయిగూడెం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): భూ భారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులు అన్నింటినీ గడువులోగా క్లియర్ చేయాలని అడిషనల్ కలెక్టర్ మంహేందర్ జీ అన్నారు. మండలంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన శనివారం సందర్శించారు. భూభారతికి సంబంధించిన ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. భూ భారతి పోర్టల్‌లో ఎదురవుతున్న సమస్యలను సిబ్బందిని అడిగి తెలుసు కున్నారు. అనంతరం మండలంలోని సమ్మక్క సాగర్ బ్యారేజీ, దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులను సందర్శించి గోదావరి వరద ప్రవాహాన్ని పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ సయ్యద్ సర్వర్, ఆర్ఐ గణేష్, డీఈఈ శరత్ బాబు, ఏఈ సాయిరాం ఉన్నారు.